అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి


షాబాద్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నూతన రేషన్‌కార్డులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి రేషన్‌కార్డులు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలనే అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంపీడీఓ అపర్ణ, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, మాజీ సర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, మునగపాటి నర్సింహులు, జంగయ్య, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, రవీందర్‌నాయక్, జనార్ధన్‌రెడ్డి, నాయకులు రాహుల్‌గుప్తా, మహేశ్, సూర్యగౌడ్, శేఖర్, డాక్టర్ రాజు తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో రూ.3 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న తరగతి అదనపు గదులు, ల్యాబ్ భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారి కృష్ణకుమారి, నాయకులు తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం

ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. డాక్టర్ ప్రభాకర్ సక్రమంగా రావడంలేదని ఆరోపణలు వస్తున్నాయని ఆయనపై మండిపడ్డారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న తరుణంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ ప్రభాకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డి.. పద్ధతి మార్చుకో..

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అసభ్యకరమైన పదజాలాన్ని వాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. పార్టీ నేత మెప్పు కోసం, సీఎం రేవంత్‌రెడ్డిపై నీచమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చెబుతూ ప్రజలను అయోమయ స్థితిలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, సీఎంను వ్యక్తిగతంగా విమర్శిస్తున్న ఆయనకు చట్టప్రకారం తప్పవని హెచ్చరించారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన ప్రభుత్వానికి ప్రజలు గత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. బీఆర్‌ఎస్ నేతల ప్రవర్తనను ప్రజలు స్పష్టంగా గమనిస్తూనే ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని, అదేవిధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం ప్రతిపక్షాలకు గిట్టడం లేదన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, బాల్‌రాజ్, తిరుపతిరెడ్డి, రఘు నాయక్, జంగ నర్సింహ్మా, శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, రాజు, అన్వర్, దర్శన్, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

క్లుప్తంగా

డ్రైనేజీ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో సోమవారం నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుమారు రూ.12 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. విడతల వారీగా అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు సోమ్లనాయక్, ప్రసన్నలత, కోస్గి శ్రీనివాస్, మాదారం నర్సింలుగౌడ్, నాయకులు దేవేందర్‌యాదవ్, జనార్ధన్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, యాదయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి నివాళి

మొయినాబాద్: మండల పరిధిలోని రెడ్డిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బసగళ్ల అరవింద్‌గౌడ్(65) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి సోమవారం ఉదయం రెడ్డిపల్లిలో అరవింద్‌గౌడ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, శ్రీహరియాదవ్, మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ముష్టిపల్లి బీసీ సేన గ్రామ కమిటీ ఏర్పాటు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లిలో సోమవారం బీసీసేన కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు బోయ చెన్నయ్య తెలిపారు. సోమవారం ఆయన సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మద్ది సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీను, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కార్యదర్శిగా బాలయ్య, కోశాధికారిగా సురేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, మల్లేష్, రాములు, మహేందర్, నర్సింలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


స్నేహితుడి భార్యకు నగదు అందిస్తున్న తోటి విద్యార్థులు

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తమతో కలిసి పదో తరగతి చదివిన తోటి మిత్రుడు అబ్బి చెన్నయ్య కొద్దికాలం క్రితం మృతి చెందాడు. దీంతో పూర్వ విద్యార్థులు ఆతని కుటుంబానికి సాయం చేయడానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా వారందరూ కలిసి సోమవారం మృతుడి భార్య సరితకు రూ.35వేల నగదును అందించారు. కార్యక్రమంలో తోటి విద్యార్థులు మధునాల శివానంద్, జహంగీర్, కిరణ్‌కుమార్‌గౌడ్, అంజనేయులు, రాఘవేందర్, మహేందర్‌రెడ్డి, దావీద్ పాల్గొన్నారు.

చేవెళ్ల ఎస్‌ఐగా తేజశ్రీ



చేవెళ్ల: పట్టణ పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా తేజశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ నుంచి చేవెళ్లకు ఆమె బదిలీపై వచ్చారు. ఈ స్టేషన్‌లో ముగ్గురు ఎస్‌ఐలు ఉండగా.. తేజశ్రీ చేరికతో నలుగురు అయ్యారు.

విద్యుత్ మరమ్మతులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కేశంపేట: మండల కేంద్రంలో రూ.25లక్షల నిధులతో విద్యుత్ మరమ్మతులు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామ మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని పనులను ప్రారంభించారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, సురేష్ రెడ్డి, తహసీల్దార్ అజాంఅలీ, ఏడీ రవీందర్, విద్యుత్ ఏఈ ఈశ్వర్, కాంట్రాక్టర్ మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయానుకూలంగా పంటలు సాగుచేయాలి

వ్యవసాయ సహాయ సంచాలకుడు సురేష్‌బాబు


చిలుకూరులో వరి నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మొయినాబాద్: రైతులు సమయానుకూలంగా పంటలు సాగుచేసి అధిక దిగుబడులు పొందాలని చేవెళ్ల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు సురేశ్‌బాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో సోమవారం ఆయన వ్యవసాయ పొలాలను సందర్శించారు. వరి నారుమడులు, జనుముల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరినాట్లకు ఇదే సరైన సమయమన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు కరిగెట్లు చేసేందుకు దోహదపడుతున్నాయన్నారు. వరి సాగుచేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ప్రతీ రైతు చేయించుకోవాలని తెలిపారు . ఆయన వెంట ఏఈఓలు సునీల్‌కుమార్, కుమార్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలను అందిస్తున్న భీమయ్య

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు భీమయ్య ఆర్థికసాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి, తైదా పర్వతాలు, కోడూరు రాములు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధికంగా వాడితే నష్టమే

మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి


కొందుర్గులో యూరియాకు పర్మిట్లు రాస్తున్న అధికారులు

కొందుర్గు: పంటలకు యూరియాను తక్కువ మోతాదులో వాడాలని, అధికంగా వాడితే పంటలకు నష్టమేనని మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కొందుర్గులో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు నాలుగు బస్తాల వరకు అందించారు. 100 మంది రైతులకు గాను 25 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియాను అధికంగా వాడటంతో పంటలు అధికంగా పెరగడంతో పాటు చీడపీడల బారిన పడుతాయని తెలిపారు. పచ్చిరొట్ట సాగుచేసిన పొలాల్లో మరీ తక్కువగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రమణ, పీఏసీఎస్ సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి


మల్కాపూర్‌లో బోరు వేయిస్తున్న దాతలు

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్ వార్డులో నీటి సమస్యను పరిష్కరించేందుకు పీఏసీఎస్ చేవెళ్ల చైర్మన్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి ముందుకొచ్చారు. వార్డులో నీటి సమస్య ఉందని ప్రజలు వారి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించి సొంత నిధులతో సోమవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా వారిని వార్డు ప్రజలు, నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రమేశ్‌గౌడ్, మధుసూదన్‌గుప్తా, శివారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం


మాట్లాడుతున్న ప్రభులింగం

చేవెళ్ల: సీపీఐ పార్టీ 17వ జిల్లా మహాసభను ఆగస్టు 2న మొయినాబాద్‌లో నిర్వహిస్తున్నామని, ఈ సభను పెద్దఎత్తున విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్‌లోని అంజనాదేవి గార్డెన్‌లో ఆగస్టు 2న జరిగే 17వ జిల్లా మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభలో భవిష్యత్ పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం, పార్టీని ఎలా బలోపేతం చేయాలనే అంశాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ దిశగా నిర్ణయాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.సుభాన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మక్బుల్, షౌరీలు, వడ్ల మంజుల, మీనాక్షి, లలిత, పోచయ్య, సత్యనారాయణ, మల్లయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

కేశంపేట: కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ జైపాల్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూడ వీరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, అనసూయ, రాజేందర్‌రెడ్డి, గ్యార సురేష్, ప్రకాష్‌గౌడ్, హరీష్‌రెడ్డి, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని సాయిబాబా ఫేస్–2, అరుణోదయ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలను తాము ఏర్పాటు చేసుకున్నామని, వీధి దీపాలు బిగించాలని కోరారు. వీధి దీపాలు లేపోవడంతో రాత్రి వేళల్లో పూర్తిగా అంధకారంలో ఉండాల్సి వస్తుందని అరోపించారు. అదేవిధంగా కాలనీలో సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. వర్షాలు కురిస్తే మట్టిరోడ్లు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయన్నారు. అదేవిధంగా మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు కటిక శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లికార్జున్‌రెడ్డి, పాండు, రాజేష్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మల్లేశ్ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆపదలో ఉన్న కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, వీరేశం గుప్తా, రాఘవేందర్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు


హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్‌కు సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న నాయకులు

షాబాద్: ఉపాధ్యాయులు పీఆర్టీయూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్, సహ ఉపాధ్యాయుడు జేమ్లా రాథోడ్‌కు సభ్యత్వ నమోదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 95 శాతం మంది ఉపాధ్యాయులు పీఆర్టీయూ సభ్యత్వం చేశారన్నారు. ఏ ఉపాధ్యాయుడికి కష్టమొచ్చిన వెంటనే స్పందించి వారి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాజాపాషా, రమేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

షాద్‌నగర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి పౌష్టిక విలువతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ఇటీవల ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారన్నారు. ఆహార భద్రత ప్రమాణాలు సరిగా పాటించకపోవడంతో ఫుడ్‌పాయిజన్ అవుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదిల్, కయ్యూం, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటలను తలపిస్తున్న రోడ్లు


హిమాయత్‌నగర్–గండిపేట్‌కు వెళ్లే రోడ్డుపై భారీగా వర్షం నీరు


హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా గుంతలో నిలిచిన వర్షం నీరు

మొయినాబాద్‌రూరల్: చినుకు పడితే చాలు రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. ఈ దారులపై వాహనదారులు, పాదాచారులకు తిప్పలు తప్పడం లేదు. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా రహదారిపై గుంతల్లో వర్షం నీరు భారీగా చేరడంతో కుంటలా తలపిస్తోంది. అటూ ఇటూ వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు, పాదాచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా హిమాయత్‌నగర్ నుంచి గండిపేట వెళ్లే రహదారి జలమయం కావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వర్షాలతో పంటలకు జీవం

షాబాద్: ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలు కళకళలాడుతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో అల్లాడిన మండలంలోని రైతులకు గతవారం రోజులుగా కురిసిన వర్షాలు సంతోషాన్నిచ్చాయి. పంటలకు జీవం పోశాయి. దీంతో రైతులు పత్తి, మొక్కజొన్న పంటలకు డీఏపీ, యూరియా, ఇతర ఎరువులు పిచికారీలో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు బోరుబావుల కింద వరినాటు పనులను ముమ్మరం చేశారు.


బోడంపహాడ్‌లో మొక్కజొన్న పంట


మన్‌మర్రిలో పత్తి పంట

లైసెన్సులు ఇవ్వాలని వినతి


మాట్లాడుతున్న మండల నాయీ బ్రాహ్మణులు

నందిగామ: తాత ముత్తాతల కాలం నుంచి కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమ వృత్తిలోకి ఇతరులు వస్తూ తమ పొట్టకొడుతున్నారని, కేవలం నాయీ బ్రాహ్మణులకు మాత్రమే సెలూన్ల లైసెన్సులు ఇవ్వాలని కోరుతూ ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెలూన్లను ఇతర రాష్ట్రాలకు చెందినవారు, మన రాష్ట్రంలోని ఇతర మతాలవారు స్థాపించుకొని తమ జీవనాధారంపై దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. మనిషి పుట్టుక నుంచి చావువరకు అన్ని శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొంటామని, తమ వృత్తిపై దెబ్బతీసే విధంగా ఇటీవల న్యాయస్థానాలు సైతం తీర్పునిచ్చాయని, అలాంటి తీర్పులను పునఃపరిశీలించాలని కోరారు. నాయీ బ్రాహ్మణులకు మాత్రమే సెలూన్ల లైసెన్సులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మల్లేశ్, వెంకటేశ్, ప్రవీన్, లక్ష్మణ్, అశోక్, రాజు, శ్రీకాంత్, రామచెంద్రయ్య, రమేశ్, రాజ్‌కుమార్, బాల్‌రాజ్, మల్లేశ్, మిట్టు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ


భక్తులకు తీర్థప్రసాదం అందిస్తున్న అర్చకులు

మొయినాబాద్‌రూరల్: ఓం నమో శివాయ.. హర హర మహాదేవ శంభోశంకర అంటూ శివ నామస్మరణతో సంగమేశ్వర దేవాలయ ప్రాంగణం మార్మోగింది. శ్రావణమాసం మొదటి సోమవారం కావడంతో జంట నగరాలతో పాటు ఆయా ప్రాంతాలు, గ్రామాల నుంచి భక్తులు అధికంగా విచ్చేశారు. ఉదయం 5 గంటల నుంచే అర్చకులు గర్భగుడిలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. ముందుగా గణపతి హోమం, గజస్తంభ పూజలు నిర్వహించిన అనంతరం మహామంగళహారతి సమర్పించారు. భక్తులు క్యూలో ఉండి శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.